క్లుప్తంగా

అందరికీ 'ఉపాధి' కల్పించాలి



వీపనగండ్ల: వర్షాభావ పరిస్థితుల వల్ల కూలీలకు సరైన పనులు లేవని, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ అధికారులు కూలీ పని చూయించాలని సీపీఐ అనుబంధ ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు వంక గోపాల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం బొల్లారంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో వసతులను గురించి అడిగి తెలుసుకున్నారు. కూలీలకు అవసరమైన పనిముట్లు, ఆహార కిట్లు, నీడనిచ్చే పరికరాలను, తాగునీటి వసతి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

కనులపండువగా గిరిజాకల్యాణం



అమరచింత: పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లోని పాత శివాలయంలో బుధవారం గిరిజా కల్యాణం వేడుకను కనులపండువగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివమహాపడి పూజ అనంతరం మరుసటి రోజు శివపార్వతుల కల్యాణం నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ అని ఆలయ పూజారి జంగం జగదీష్ తెలిపారు. శివమహాపడి పూజ నిర్వహించిన భక్తులు కల్యాణ వేడుకల్లో పాల్గొని గిరిజా కల్యాణ వేడుకలను చూసి భక్తితో మురిసిపోయారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొట్టం విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులపై దాడులు చేస్తే సహించేదిలేదు



ఆత్మకూర్: గ్రామ అభివృద్ధే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులపై దాడులు చేయడం హేయమైన చర్య అని పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణనాయక్, జూనియర్ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు నిరసన చేపట్టారు. మండలంలోని రేచింతలలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శి మణ్యంపై మాజీ వార్డు సభ్యుడు రాములు దాడి చేయడం విచారకరమన్నారు. విధుల్లో ఉన్న కార్యదర్శిపై దాడికి పాల్పడ్డ వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లన్న, హరీష్, వెంకటేష్, నూతన్, మనోహర్, మురళీ, వెంకటపతిరాజు, యశోద, మానస, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

అందరి సమక్షంలో క్షమాపణ

పంచాయతీ కార్యదర్శి మణ్యంపై దాడికి పాల్పడ్డ రాములు రేచింతల గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు బాలకిష్టన్న, విష్ణువర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రహ్మతుల్లా, తులసీరాజ్, పరమేష్, శ్రీనుతో కలిసి కార్యదర్శుల నిరసన కార్యక్రమం వద్దకు చేరుకుని క్షమాపణలు చెప్పాడు. కార్యదర్శిపై దాడి చేయడంపై చింతిస్తున్నానని భవిష్యత్‌లో ఇలాంటి చర్యలకు తనతో పాటు ఎవ్వరు కూడా పాల్పడకుండ చూసుకుంటామని హామీనిచ్చారు. విధుల్లో ఉన్న అధికారులను గౌరవించాలని, ప్రత్యేక అధికారుల పాలనలో కలిసిమెలిసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని నాయకులు సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదును కార్యదర్శులు ఉపసంహరించుకున్నారు.

పరీక్షలు నిర్భయంగా రాయాలి

కొత్తకోట: విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా నిర్భయంగా పరీక్షలు రాయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కొత్తకోట, మదనాపురం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే సౌజన్యంతో ఇంపాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని కోరారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలలు, గురువులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి సన్మానిస్తామన్నారు. మోటివేటర్ గంప నాగేశ్వర్‌రావు పరీక్షల్లో పాటించాల్సిన సూచనలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిలర్ల తిరుగుబావుటా

అమరచింత పుర చైర్మన్‌పై అవిశ్వాసం కోరుతూ కలెక్టర్‌కు లేఖ



కలెక్టర్ తేజస్ పవార్‌కు లేఖ అందిస్తున్న కౌన్సిలర్లు

అమరచింత: స్థానిక పురపాలికలో నాలుగేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భారీగా అవినీతి జరిగిందంటూ కౌన్సిల్ సభ్యులు తిరుగుబావుటా ఎగురవేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌ను గద్దె దించేందుకు బుధవారం కలెక్టర్ తేజస్ పవార్‌ను కలిసి అవిశ్వాసం కోరుతూ లేఖ అందించారు. దీంతో స్థానికంగా రాజకీయ వేడి రాజుకుంది. పుర ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి ఒకరు, సీపీఎం నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరు, సీపీఐ నుంచి ఒకరు, ఇండిపెండెంట్ ఒకరు, టీడీపీ నుంచి ఒక కౌన్సిలర్ గెలుపొందారు. ఎవరికీ సరైన మెజార్టీ రాకపోవడంతో సీపీఎం భాగస్వామ్యంతో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మంగమ్మ పుర చైర్‌పర్సన్‌గా, సీపీఎం కౌన్సిలర్ జీఎస్ గోపీ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

సమన్వయం లోపమే..

పట్టణంలో చేపట్టే అభివృద్ధి పనుల గురించి కౌన్సిల్ సభ్యులకు సమాచారం లేకపోవడం, సమావేశాలకు ఆహ్వానించకపోవడం, తీర్మానాలపై సంతకాలు చేయకున్నా పట్టించుకోకపోవడంతో కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, అప్పటి కమిషనర్లు కలిసి పురపాలికను భ్రష్టు పట్టించారంటూ బాహాటంగా చర్చ ప్రారంభమైంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఆమోదించమని వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు పట్టుబట్టడంతో సమావేశం వాయిదా పడింది. నిన్నటి వరకు మున్సిపల్ వైస్ చైర్మన్ గోపి ద్వారానే అవిశ్వాసం లేఖ అందించాలని అనుకున్నా తాజాగా ఆయనను కూడా పక్కనబెట్టి ఆరుగురు కౌన్సిలర్లు కలెక్టర్‌కు లేఖ అందజేయడం చర్చనీయాంశంగా మారింది.

అవినీతిని సహించలేకే..

పురపాలికలో జరిగిన అవినీతిని సహించలేకనే అవిశ్వాసానికి సిద్ధమయ్యామని కౌన్సిలర్లు వెల్లడించారు. ఇప్పటి వరకు హరితహారంతో పాటు బ్లీచింగ్ పౌడర్ కొనుగోళ్లలో భారీ అవినీతి జరిగిందని లెక్కల్లో తేలిందని.. అలాగే తమ సంతకాలు ఫోర్జరీ చేసి తీర్మానాలు చేశారని ఆరోపిస్తున్నారు. ఏదేమైనా 10 మంది కౌన్సిలర్లలో ఆరుగురు ఒక్కటి కావడం విశేషం.

కౌన్సిలర్లతో మాజీ మంత్రి భేటీ

- మరోమారు బుజ్జగింపుల పర్వం
- క్యాంపునకు వెళ్లే యోచనలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు



కౌన్సిలర్లతో భేటీ అయిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: జిల్లా కేంద్రమైన వనపర్తి మున్సిపల్ పాలకవర్గంపై అవిశ్వాసం పెట్టాలని ఈనెల 26వ తేదీన కలెక్టర్‌కు నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయంపై స్పందించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బుధవారం బీఆర్‌ఎస్ కౌన్సిలర్లతో తన నివాసంలో భేటీ అయ్యారు. అవిశ్వాసం పెట్టడం ఎందుకు చైర్మన్, వైస్‌చైర్మన్‌ను రాజీనామా చేయిస్తాను.. పార్టీ నిర్ణయం మేరకు మీలో ఒకరి చైర్మన్‌గా, మరొకరిని వైస్‌చైర్మన్‌గా ఎంపిక చేస్తామని మాజీ మంత్రి చెప్పారు. దీంతో రెండు రోజుల్లో వారితో రాజీనామా చేయిస్తే.. మీ మాట ప్రకారమే పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని, లేదంటే కలెక్టర్‌కు ఇచ్చిన నోటీసు ప్రకారం అవిశ్వాస తీర్మానానికి సిద్ధమవుతామని కౌన్సిలర్లు తేల్చి చెప్పారు. కౌన్సిలర్లతో బీఆర్‌ఎస్ పెద్దలు తెల్లకాగితాలపై సంతకాలు చేయించుకున్నట్లు జిల్లా కేంద్రంలో చర్చ వినిపిస్తోంది. ఇప్పటికే పలు మార్లు కౌన్సిలర్లను బుజ్జగించినా.. మాజీ మంత్రికి సమాచారం ఇవ్వకుండా కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసులు ఇవ్వటంపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

క్యాంపునకు వెళ్లే యోచనలో అసమ్మతి కౌన్సిలర్లు

మాజీ మంత్రి రెండు రోజుల్లో చైర్మన్, వైస్‌చైర్మన్‌తో రాజీనామా చేయించకుంటే.. అసమ్మతి కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లే యోచనలో ఉన్నట్లు బీఆర్‌ఎస్‌లో చర్చ వినిపిస్తోంది. ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ ఇటీవల బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఓ నాయకుడి ఇంట్లో కూర్చొని ఉండటం తెలుసుకున్న బీఆర్‌ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు అవిశ్వాసం ఎలాగైనా గెలవాలనే పట్టుదలకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయంను మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం.

చైర్‌పర్సన్ హామీతో సమ్మె విరమణ



కార్మికులకు వేతన చెక్కు అందిస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: తమ సమస్యలు పరిష్కరించాలంటూ స్థానిక పుర కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో రెండురోజులుగా సమ్మె చేపడుతున్నారు. బుధవారం ఆరు నెలల బకాయి వేతనాలకుగాను ప్రస్తుతం రెండు నెలల వేతనం చెల్లిస్తామని.. ముందుగా ఒక నెల వేతన చెక్కును మున్సిపల్ చైర్‌పర్సన్ అందించడంతో సమ్మె విరమిస్తున్నట్లు కార్మికులు ప్రకటించారు. పట్టణంలో పారిశుద్ధ్యం, తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారు కావడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కౌన్సిలర్ రాజ్‌కుమార్ బుధవారం సమ్మె శిబిరం వద్దకు చేరుకొని పుర కార్మికులతో చర్చలు జరిపారు. ప్రస్తుతం బడ్జెట్ ప్రతిపాదనలు జరుగుతున్నాయని.. కొంత సమయం ఇవ్వాలన్నారు. ప్రస్తుతం ఒక నెల వేతన చెక్కు అందిస్తామని.. మరోనెల వేతనం ఎస్టీఓకు పంపామని, పట్టణ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఆందోళన విరమించాలని కోరారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్‌ఎన్ రమేష్ మాట్లాడుతూ.. ఆరు నెలల వేతనంతో పాటు 8 నెలల పెండింగ్ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలన్నింటిని 15 రోజుల్లో పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ హామీతో సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ప్రభాకర్, ప్రేమ్, హరికృష్ణ, తిప్పన్న, సూరి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమందడి ఎంపీపీగా రఘుప్రసాద్



కొత్తకోట రూరల్: పెద్దమందడి ఎంపీపీగా రఘుప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఎంపీపీగా ఉన్న తూడి మేఘారెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వనపర్తి నుంచి గెలుపొందడంతో తన పదవికి రాజీనామా చేశారు. బుధవారం పెద్దమందడి మహిళా సమాఖ్య భవనంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ పద్మావతి ఆధ్వర్యంలో ఎంపీపీ ఎన్నిక జరిగింది. మొత్తం 12 మంది ఎంపీటీసీ సభ్యులకుగాను ఏడుగురు ఓటింగ్‌కు హాజరయ్యారు. మెజార్టీ సభ్యులు రఘుప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి రఘుప్రసాద్‌కు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ సద్గుణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



హోమం చేస్తున్న తండావాసులు

మదనాపురం: మండలంలోని కొన్నూరు పెద్దతండాలో రామలింగేశ్వర ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం ఆరాధన యాగం, దేవతల రుద్ర జపములు హోమం, పంచసూక్త హవనం, పూర్ణాహుతి, మంగళహారతి, తీర్థ వితరణ దేవతల ఊరేగింపు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం సంక్షిప్త రామాయణ, శ్రీ విష్ణు సహస్ర రుద్ర పారాయణము, ధాన్యాది, పుష్పాది ప్రతిష్ఠాంగ హోమం, మంగళహారతి తీర్థప్రసాద వితరణ చేశారు. గురుస్వామి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో 9 మంది వేద పండితులు హోమం కార్యక్రమాలను నిర్వహించారు. తండాలోని 50 మంది దంపతులు హోమంలో కూర్చొని పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్, నిర్వాహకులు వీరేష్ నాయక్ తెలిపారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

జిల్లా ఇన్‌చార్జ్ విద్యాధికారి గోవిందరాజులు



ప్రయోగాలను తిలకిస్తున్న అతిథులు

పెబ్బేరు రూరల్: విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకొని భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు కోరారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని హరిజన్‌వాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్‌డీఎస్ సంస్థ సహకారంతో సైన్స్ విజ్ఞానమేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు అడిషనల్ ఎస్పీ రాందాస్ తేజావత్, డీవైఎస్‌ఓ సుధీర్‌రెడ్డి, డీఎఫ్‌ఓ నవీన్‌రెడ్డి, ఆర్‌డీఎస్ సంస్థ అధ్యక్షురాలు చిన్నమ్మ, జీసీడీఓ శుభలక్ష్మి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, సామాజికవేత్త మురళీధర్, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. 10వ తరగతి వార్షిక పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. అడిషనల్ ఎస్పీ రాందాస్ తేజావత్ మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీవీ రామన్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు.

అనాథ ఆశ్రమానికి సరుకులు వితరణ

గోపాల్‌పేట: ప్రపంచ టైలర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక టైలర్లు బుధవారం వనపర్తిలోని అనాథ ఆశ్రమంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకొని సంబురాలు చేసుకున్నారు. తమవంతుగా ఆశ్రమానికి యాభై కిలోల బియ్యం, పండ్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైలర్లు కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వారి కష్టాన్ని గుర్తించి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. పిల్లల చదువు ఫీజుల్లో రాయితీలు కల్పించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో టైలర్లు కిషోర్, రాజు, కుమార్, వెంకటేష్, ఈశ్వర్, సుధాకర్, సాయిబాబు ఉన్నారు.

కొత్తకోట రూరల్: జాతీయ టైలర్స్ దినోత్సవాన్ని కొత్తకోట టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పాలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు రబ్బానీ, ప్రధాన కార్యదర్శి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి ఎమ్మెల్సీ టికెట్ కేటాయించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గుంత మౌనిక

కొత్తకోట రూరల్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ టికెట్‌ను దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి కేటాయించాలని ఎంపీపీ గుంత మౌనిక మాజీ సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఎంపీపీ చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గంలో మాజీ సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందని, రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని చెక్‌డ్యాంల నిర్మాణాలను ఇక్కడ నిర్మించుకున్నామని తెలిపారు. నియోజవర్గ ప్రజల్లో ఆలన్నకు ఎంతో అభిమానం ఉందని, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడా ఓడిపోయారని, ఇప్పుడు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే భారీ విజయం దక్కుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో 1445 ఎంపీటీసీ స్థానాలు ఉంటే బీఆర్‌ఎస్‌కు 1039, కాంగ్రెస్‌కు 241 మంది, బీజేపీకి 119మంది, ఇతరులు 46మంది ఉన్నారన్నారని, ఈ లెక్క ప్రకారం బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలిచేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో 451మంది కౌన్సిలర్లు, 82మంది జెడ్పీటీసీలు ఉండగా బీఆర్‌ఎస్‌కే ఎక్కువ మంది కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు ఉన్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ వడ్డె శ్రీను, మాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేష్, కో ఆప్షన్ సభ్యుడు అల్లబాషా, ఎంపీటీసీ లక్ష్మణ్‌నాయక్, రాజశేఖర్, గోవింద్ తదితరులు ఉన్నారు.

బీజేపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంకండి



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్ యాదవ్

పెబ్బేరు రూరల్: వనపర్తి నియోజకవర్గంలో డాక్టర్ చిన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తించిన అధిష్ఠానం ఆయనకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమించడంపై కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. వనపర్తి పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను తిప్పికొడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ దేశ యువతను మోసం చేసిందని దుయ్యబట్టారు. కులం, మతం మత్తులో దింపుతూ యువత జీవితాలను నాశనం చేస్తుందని ఆరోపించారు. రాహుల్‌గాంధీపైన సోషల్ మీడియా వేదికగా చేస్తున్న తప్పుడు ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ప్రమాణస్వీకారానికి తరలిరావాలి

గురువారం ప్రజాభవన్‌లో డాక్టర్ జి చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా మహాత్మ జ్యోతిబాయ్ పూలే ప్రజాభవన్‌కు కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. అదే విధంగా మార్చి 2న రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన విభాగానికి సంబంధించిన రాష్ట్రస్థాయి సదస్సు హైదరాబాద్‌లోని మల్లికా గార్డెన్‌లో నిర్వహిస్తున్నందున సమావేశానికి ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు జిల్లా నుంచి వంద మంది చొప్పున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోట్ల రవి, నందిమల్ల యాదయ్య, కృష్ణ, ఖమ్మర్‌మియా, చీర్ల జనార్దన్‌సాగర్, రాగివేణు, వెంకట్, నారాయణ, పెంటన్న, భాస్కర్, వేణాచారి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు



ఖిల్లాఘనపురం పరీక్ష కేంద్రం వద్ద..

ఆత్మకూర్: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వికాస్ కళాశాలలోని రెండు సెంటర్లలో మొదటి రోజు 355 మంది విద్యార్థులకుగాను 304 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎక్జామినేషన్ సూపర్‌వైజర్లు భాగ్యవర్ధన్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి తెలిపారు.

వీపనగండ్ల: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలో తమ కళాశాల నుంచి 73 మంది హాజరు కావాల్సి ఉండగా 70 మంది హాజరై, ముగ్గురు గైర్హాజరైనట్లు వీపనగండ్ల జూనియర్ కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ రాంరెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌ను కేటాయించగా స్థానిక తహసీల్దార్ వరలక్ష్మి కేంద్రాన్ని తనిఖీ చేశారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బుధవారం ప్రారంభమైన ప్రథమ సంవత్సరం ఇంటర్ పరీక్షలలో 115 మంది విద్యార్థులకు గాను ముగ్గురు విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేష్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ రాములు పేర్కొన్నారు. పరీక్షల సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉండటంతో పోలీసులు పెట్రోలింగ్ చేశారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో 254 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 243 మంది పరీక్షకు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ లావణ్య తెలిపారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 166 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 160 మంది విద్యార్థులు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపల్ రాధ తెలిపారు. ఉదయం తహసీల్దార్ పాండునాయక్, ఎస్‌ఐ శ్రీహరి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.




ఆత్మకూర్‌లో..

మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు



తోమాలపల్లిలో..



దావాజిపల్లి నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కోటేశ్వర్

పాన్‌గల్: వేసవికాలం దృష్ట్యా నర్సరీల్లో మొక్కలు ఎండకుండా ప్రతి నిత్యం వాటరింగ్ చేయాలని ఎంపీడీఓ కోటేశ్వర్ అన్నారు. బుధవారం మండలంలోని దావాజిపల్లి, దొండాయిపల్లి గ్రామాల్లో నర్సరీలను, ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో మొక్కలు ఎండితే వాటి స్థానంలో నూతన మొక్కలను నాటాలని, ఉపాధి పనులకు వచ్చే కూలీల ఫొటోలనే చిత్రీకరించాలని, రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సమస్యలు ఉంటే వాటిని మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకరావాలన్నారు. పంచాయతీ కార్యదర్శి విజయలత, ఫీల్డ్ అసిస్టెంట్లు గోపాల్‌గౌడు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని తోమాలపల్లి నర్సరీని, రోడ్డు వెంట నాటిన మొక్కలు, ఉపాధి పనులను బుధవారం ఎంపీడీఓ రవీందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలని, నర్సరీల్లో పూల మొక్కలు గన్నేరుకామ, చింత, సీమతంగడి మొక్కలను పెంచుతున్నామన్నారు. ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో మొక్కలకు ప్రతిరోజు నీరు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ అక్తర్‌నిసాబేగం, టీఏ పుష్పలత, ఎఫ్ఏ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



అమడబాకుల మోడల్ స్కూల్‌లో..

ఖిల్లాఘనపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, అల్లమాయపల్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అప్పారెడ్డిపల్లి పాఠశాలలో హెచ్‌ఎంగా శివకుమార్, ఆర్‌జేడీగా రేష్మ, కలెక్టర్‌గా పావని, డీఈఓగా రాఘవేందర్, ఎంఈఓగా స్వాతి వ్యవహరించగా రెండు పాఠశాలల్లో మరో 45 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అల్లమాయపల్లి పాఠశాలలో హెచ్‌ఎంగా హేమలత, డీఈఓగా అరవింద్, ఎంఈఓగా శివకుమార్ వ్యవహరించగా సోని, వర్షిని, ప్రియాంక, శ్వేత, అనూష, సాయి, చరణ్ ఉపాధ్యాయులగా వ్యవహరించారు. ఉత్తమ బోధన చేసిన విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సూర్యసంజీవ, నవీన్, శంకర్, శ్రీశైలం, అబ్దుల్ వాహెద్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల మోడల్ స్కూల్‌లో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌గా సంధ్య, డీఈఓగా వంశీగౌడ్, డిప్యూటీ డీఈఓగా బేబీ, ప్రిన్సిపాల్‌గా భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్‌గా మహబూబ్‌తో పాటు 50విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిలో ప్రతి సబ్జెక్టులో ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసచారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తూర్పింటి నరేష్‌కుమార్, ఉపాధ్యాయ బృందం ఉస్మాన్, రాఘవేంద్రశర్మ, చిన్నరాములు, సరిత తదితరులు ఉన్నారు.



వీపనగండ్లలో..

వీపనగండ్ల: మండల కేంద్రంలోని డాఫోడీల్స్ స్కూల్‌లో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవంతో పాటు సైన్స్ డేను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బత్తుల రాముడు, ఉపాధ్యాయులు లక్ష్మీకళ్యాణి, పార్వతి, రాజేశ్వరి, మాసూం, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండలంలోని నర్సింగాపురం ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా ఇందు, డీఈఓగా సూర్యచంద్ర, ప్రధానోపాధ్యాయురాలుగా కుమారి స్వాతితో పాటు మరో 15మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా తమ విధులను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాణిక్యమ్మ, ఉపాధ్యాయులు వెంకటేశ్వరనాయక్ పాల్గొన్నారు.